మీ కంత బావుంది?" రాజేశ్వరి సూటిగా చూసింది.

మధుమూర్తి ముఖంలో తిరస్కారం స్పష్టంగా కన్పించింది — "నీ మొహం! అర్థంపర్థంలేని ధోరణి నువ్వూను. మన దేశాచారాలు — మన నీతినియమాలూ — మన కట్టుబాట్లూ యివ్వా కెలా పోతాయ్? నీ ఆలోచనలే ప్రతీ ఆడదానికీ వుంటే సంసారాలు మహానందంగా సాగేలా వున్నాయ్."

"మీరెన్ని వెటకారాలైనా చేయొచ్చు. ఆ అధికారం మీకు వుంది. కాని ఒక కథమీద అభిప్రాయం ఏర్పర్చుకునే అధికారం నాకూవుంది. నాలా ఆలోచించే ఆడది సంసారాన్ని సంతోషమయం చేసినా తాను శాంతిగా మాత్రం వుండలేదు —"

మధుమూర్తి రాజేశ్వరి కళ్ళలోనే చూశాడు — "నువ్వు శాంతిగా బ్రతకటం లేదా?"

"పరిస్థితి వేరు. దానికీ దీనికీ ముడి పెట్టకండి — పుస్తకాల విషయమై మాట్లాడితే మాత్రం ఆడదాన్ని గురించి ఎవ్వరూ రాయటంలేదంటున్నాను. ఆడది ఎందుకు ఏడుస్తుందో కూడా ఎవ్వరూ ఆలోచించరు."

"ఇన్ని ఆలోచిస్తునావ్. నువ్వేరాయకూడదూ?" నవ్వుతూ అన్నాడు మధుమూర్తి — రాజేశ్వరికూడా కొంత తేలిగ్గా నవ్వుతూ అంది — "నేను రాస్తే మరి మీ రెవర్ని చూసి నవ్వుతారు?"

"ఎంత ఆడదానివై పుడితే మాత్రం ఆడవాళ్ళంటే ఎందు కలాపడిచస్తావ్?" — మధుమూర్తి మాటలు తేల్చేసేముందు ఎప్పుడూ అలా అంటూనే వుంటాడు. అది నిజంకూడాను.

ఆడవాళ్ళంటే రాజేశ్వరికి ఏమిటో దయ — ఆడవాళ్ళ బాధలంటే ఏదో సానుభూతి — ఆడవాళ్ళ చరిత్రలంటే ఎందుకో ఆసక్తి — ఆడదై పుట్టినందుకు తనిమీద తనకే జాలి — ఎవరిమీద ఎంత కరుణ వుండిమాత్రం తనేం చెయ్యగలదు! తనూ ఓ ఆడపిల్లని కన్నది. తనూ కొంత దౌర్భాగ్యాన్ని — కొంత విషాదాన్ని సృష్టించింది. తనపాప...ఆడది!

పక్కలో పాప మెత్తగా కదిలింది — చక్కలిగింత పెట్టినట్టు రాజేశ్వరి తదేకంగా కూతుర్ని చూసుకొంటూ కూర్చుంది - 'ఇది ఓ చిత్రమైన అనుభూతి — ఈ అనుభూతికూడా ఆడదానికే. అందుకే కాబోలు చలం అంటాడు — బిడ్డతో పాటు ఆడదానికి రొమ్ముల్లో పాలూ - గుండెల్లో ప్రేమా పుట్టుకొస్తాయని —నిజమే, ఈ ఘడియలన్నింటినీ యధాతధంగా డైరీలో రాసుకోవాలి. ఈ అనుభూతు లన్నీ సజీవంగా చిత్రించుకోవాలి. ఎప్పుడో ... ఎప్పుడెప్పుడో పాప పెద్దదయ్యాక ... తన వయస్సు వుడిగాక... ఈ రాతలు చదువు

